అనసూయమ్మ పెళ్ళి ప్రసక్తి తేగానే తీరిగ్గా కూర్చొని 'మాగజైన్' తిరగేస్తున్న సుధీర చివుక్కున తలెత్తి విసురుగా లేచి నుంచోవడం చూసి రవి ఆట పట్టిస్తున్నట్లుగా–'లేచింది మహిళా లోకం....' అని పాడాడు.

అంతే. 'టప్'మని పుస్తకం మీద పడటంతో రవి సుధీర దెస చూసాడు. కోపంగా రవినే చూస్తూ అడుగేస్తూ పొడుగాటి తన జడను విసురుగా వెనక్కి తోసింది.

"బాబోయ్ సత్యభామ!" గదిలోకి పరుగెత్తాడు రవి.

"ఏమిటే అది! పెద్దా చిన్నా లేకుండా? ఆడపిల్లలకు కాస్త నమ్రత ఉంటేనే అందం. నీకంటే పెద్ద అని కూడా చూడకుండా ఏమిటా విసురు రవి మీద?" సన్నగా చివాట్లేస్తోంది అనసూయమ్మ.

తల్లివైపు ఒకసారి చురుగ్గా చూసి ఊరుకుంది. మరో 'మాగజైన్' అందుకుంది కుర్చీలో కూర్చుంటూ సుధీర.

"చెప్పిందేమైనా వినిపించిందా?" తల్లి అడిగింది విసుగ్గా.

"ఏమిటమ్మా?" సాధ్యమైనంత మామూలుగా అడిగింది సుధీర.

"ఏడ్చినట్లుంది – చదవేస్తే వున్న మతి పోయిందిట. అందుకే అన్నారు ఆడపిల్లలకు చదువులొద్దని. మాయదారి చదువులొచ్చి ఆడపిల్లలు బొత్తిగా చెడిపోయారు. ఓ మంచి లేదు. మర్యాద లేదు. నమ్రత ఎక్కడా కనిపించదు. పెద్దల మాటమీద మన్నన అసలే లేదు. మా కాలంలో...." అనర్గళంగా సాగిపోతున్న తల్లి వాగ్ధోరణికి 'ఫుల్‌స్టాప్' పెట్టడానికి చిరాగ్గా అంది సుధీర–

"ఖర్మ. ప్రారంభించావా ఆడపిల్లల మీద, వాళ్ళ చదువుల మీదా–దండయాత్ర?" నుదుటను చేయి ఆనించింది.

"నీ ఖర్మ కాదే. అంతా నా ఖర్మ! నేను చేసుకున్న పాపం. నీలాంటి శిఖండిని, జగమొండిని కూతురిగా కన్నాను" కోపంగా అంది అనసూయమ్మ నెత్తి బాదుకుంటూ.

"అబ్బబ్బ. ఏమిటమ్మా నీ సొద. అసలు సంగతి చెప్పరాదూ?" కాస్త మెత్తబడుతూ అంది సుధీర.

"అదే అదే. ఏమిటంత పరధ్యానం అని అడుగుతున్నాను. నిన్ను చూసుకోడానికి పెళ్ళివారొస్తున్నారు సాయంత్రం...."

"వ్వాట్" అదిరిపడుతూ అంది సుధీర.



" నోరు మూసుకుని చెప్పినట్లు చేయి! ఎక్కడికీ తగలడక నాల్గు గంటలకంతా రెడీగా వుండు. మొన్న కొన్న పట్టుచీర కట్టుకో. ఆ రింగులు తీసేసి జూకాలు పెట్టుకో. ఫాషన్‌గా వదులుగా జడ వేసి సగం దాకా వదలకుండా గట్టిగా బిగించి అల్లుకో. ఇంకా...."

"....వంకీలు పెట్టుకొంటాను. చిన్న బొట్టు మానేసి కాసంత కుంకుమ బొట్టు పెట్టుకొంటాను. కాసులపేరు దిగేసుకుంటాను. నడుముకు వడ్డాణం బిగించుకుంటాను" తల్లి మాటలను పూరిస్తున్న సుధీరను ఉరిమినట్లు చూసింది అనసూయమ్మ.

" చాల్లే పరాచికాలు. ఏళ్ళొచ్చాయి ఎందుకు? వయసుకు తగ్గ జ్ఞానం లేకపోయాక?"

" అమ్మా" అసహనంగా పలికింది సుధీర. రోషంతో మొహం ఎర్రబడింది. ఇక ఊరుకుంటే లాభం లేదు. ఎమ్. ఎ. 'సోషియాలజీ' చేసి 'వివాహం' పైన 'రిసెర్చ్' చేస్తున్న సుధీరలో జ్ఞానానికి, వివేకానికీ తక్కువేం లేదు.

తన అభిప్రాయాలు యీరోజు ఖచ్చితంగా చెప్పేయాలనుకుంది. గొంతు సవరించుకుంది.

" అమ్మా! నీకిదివరకెన్నోసార్లు చెప్పాను– యిలా పెళ్ళి చూపుల తతంగం పెట్టుకోవద్దని. నేనేం మనిషిననుకున్నావా గొడ్డుననుకున్నావా? సంతలో గొడ్డును చూసుకున్నట్లు ఏమిటీ చూసుకోడాలు? గొడ్డును బేరమాడినట్లు, బజారులో వస్తువుల నాణ్యత చూసుకున్నట్లు ఏమిటీ కట్నాల బేరం? మగవాడితో సమానంగా చదువుకొని, ఉద్యోగాలు చేసుకుంటున్నా కూడా యీ మహిళా దశాబ్దంలో ఆడపిల్ల–పెళ్ళిచూపుల పేరుతో అడ్డమైన మగవాళ్ళ ముందూ తలవంచుకుని నిల్చోవలసిందేనా? ఏం? మగవాడు మాత్రమే చూసుకోవాలా? చూసుకోడానికి ఛార్జీలిచ్చి పిలిపించుకోవడాలు, వాళ్ళకు రకరకాల పిండి వంటలతో విందు చేయడాలు ఏమిటీ అర్థం లేని ఖర్చులు? కట్నాలంటూ, కానుకలంటూ, లాంఛనాల పేరుతో ఆడపిల్లల తండ్రిని నిలువుదోపిడీ చేసే యీ వ్యవస్థమారాలి. ఏం? వివాహం ఆడపిల్లలకు ఎంత అవసరమో మగవాడికీ అంతే. ఇద్దరిలో ఏ ఒకరు లేకపోయినా ఆ వ్యవస్థే లేదుకదా! అలాంటప్పుడు కేవలం ఒక్క ఆడపిల్లల వైపు వాళ్ళు మాత్రం ఎందుకు బాధపడాలి? ఎందుకు ఖర్చు పెట్టాలి? న్యాయంగా వివాహం రెండు వర్గాల వారికీ సంబంధించినది కాబట్టి ఖర్చులు సమంగా యిద్దరూ భరించాలి. ఇంకా మాట్లాడితే పెండ్లి కొడుకే తన సంసారానికి కావలసినవి ఏర్పాటు చేసుకోవాలి తెలుసా?"

" ఒసేయ్ ఒసేయ్ ఏమిటే ఆ అఘాయిత్యపు మాటలు?" ఆవేశంగా చెప్పుకుపోతున్న కూతుర్ని వారించాలని చూసింది అనసూయమ్మ. ఆవిడ గుండెలు బేజారెత్తినట్లుగా వుంది యీ మాటలు వింటూంటే.

" నువ్వూరుకోమ్మా. నన్నాపకు. అవును ఏం? నేనన్నదాంట్లో తప్పేముంది? విదేశాలలో వధూవరులు తమ సంసారానికి కావలసింది తామే సమకూర్చుకుంటారు తెలుసా? ఇలా ఆడపిల్లల తండ్రిని 'టాక్సు' చేయరు. ఎంచక్కా అన్నీ సమకూర్చుకుని విడిగా కాపురం పెట్టేస్తారు. ఓహ్. అలాంటి వ్యవస్థ మన దేశంలో ఎప్పుడొస్తుందో కదా! హుఁ...ఆడపిల్ల ఓ అబ్బాయితో మాట్లాడితేనే, స్నేహంగా వుంటేనే బుగ్గలు నొక్కుకొని, శీలంలేని దానిగా జమకట్టి, నీచంగా, కుసంస్కారంగా మాట్లాడే అమ్మలక్కలున్న యీ దేశం యిప్పట్లో బాగుపడటం అసంభవం."

ఒక్క నిమిషం ఆగింది. ఊపిరి పీల్చుకుంది.

అనసూయమ్మ నోరు మెదపబోయింది.

కాని వెంటనే సుధీరే అందుకుంది. " పెళ్ళి అంటూ మూడురోజులు డబ్బు తగలేయడం కన్నా క్లుప్తంగా జరిపించాలి. అసలు అమ్మాయి అబ్బాయి చేత ఎందుకు తాళి కట్టించుకోవాలి? అబ్బాయి ఎందుకు మూడు ముళ్ళు వేయాలి? తాళి అనేది ఆడదానికి సంసారం చేయడానికి 'లైసెన్సు' అయితే అది మగవాడికి అక్కరలేదా? అసలు యిలా తాళికట్టి మూడు ముళ్ళు వేయడంతో మగవాడికి ఎక్కడలేని అలుసు ఏర్పడి ఆడదాని మీద అధికారం చెలాయిస్తాడు. ఆడపిల్లకు మాత్రమే వివాహ గుర్తుగా పరిమితమైన యీ తంతు బహిష్కరించాలి. ఈ మహిళా దశాబ్దంలో మా విద్యార్థినుల సంఘం యిలాంటి తంతులన్నీ బహిష్కరించదలిచాం. మగవాడికి అక్కరలేనివి ఆడదానికీ అక్కరలేదు. ఇద్దరికీ ప్రతి విషయంలోనూ నీతి, న్యాయాలు, తతంగాలు సమంగానే ఉండాలి."

" అయితే....అయితే .... నువ్వనేదేమిటే?" గొంతు తడారి పోతోంది అనసూయమ్మకు.

గంభీరంగా పలికింది సుధీర—" వివాహం ఒక పవిత్రమైన కార్యం. వివాహ బంధాన్ని శాశ్వత బంధంగా చేసుకోవడంలో భార్యా భర్తలిద్దరికీ సమంగానే బాధ్యత వుంది. మనస్ఫూర్తిగా దానికి కట్టుబడి ఉండటానికి భార్య మెడలోని తాళి గుర్తుగా వుండనక్కర్లేదు. మాంగల్యం కంటే పవిత్రమైన, నిష్కల్మషమైన, అనురాగ పూరితమైన మనసే ముఖ్యం. కాబట్టి వివాహం రిజిస్ట్రార్ ఆఫీసులోనో లేక గుళ్ళోనో జరిపించవచ్చు. తాళి కట్టే తంతు బదులు, పూలదండలు మార్చడం, ఉంగరాలు పరస్పరం తొడగడం జరపవచ్చు. మనసే సాక్షిగా అలా కట్టుబడి ఉండకపోతే అలాంటి భర్తలు మాకొద్దు! ఇదే మా యువతులు యీ మహిళాదశాబ్దంలో తీసుకోబోతున్న నిర్ణయం. ఇదే మా ఆశయం, ఆదర్శం. మా లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తాం. ఎన్ని సంవత్సరాలైనా నిరీక్షిస్తాం. మా నిరీక్షణ ఫలించిందా–సుఖమైన జీవితం పంచి యిస్తాం. లేదా ఆ జన్మ బ్రహ్మచారిణులుగా, కన్యలుగా వుండిపోయి సంఘసేవ చేస్తాం" ముగించింది సుధీర. అవును మరి. 'రిసర్చ్' చేస్తున్న తను సమాజంలో అనాదిగా పీడిస్తున్న యీ వివాహ వ్యవస్థను రూపుమాపి కొత్తగా రూపొందించాలి. లేకపోతే తన చదువుకు సార్థకత ఏదీ?

'శిల్ప'

ఫోస్ఫోమిన్ ఐరన్

కుటుంబం కోసం... ప్రేమానురాగం, సంతోషం, సంరక్షణ



మరి తన కోసం...

ఫోస్ఫోమిన్ ఐరన్

స్త్రీల కోసం...ప్రత్యేకంగా రూపొందించబడిన టానిక్




ఆరోగ్యకరమైన ఎర్రని రక్తకణాలను పెంపొందింప జేస్తుంది...శక్తిని తిరిగి ప్రసాదిస్తుంది, దారుఢ్యమును పెంపొందిస్తుంది, శరీరము యొక్క రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది.

నియమానుసారంగా ఫోస్ఫోమిన్ ఐరన్ సేవించండి.

SARABHAI CHEMICALS LTD.

Shilpi SC 3A/76 tel

అనసూయమ్మ నోరు తెరచుకొని అలాగే కూర్చుండిపోయింది.

సుధీర సుదీర్ఘ ఉపన్యాసాన్నంతా విన్న రవి 'క్లాప్స్' కొడుతూ వచ్చాడు.

"బేష్. సార్థక నామధేయురాల వవుతావన్న మాట. భలే భలే. సు....ధీ....ర" నొక్కి పలుకుతూ అన్నాడు.

"అవును" గర్వంగా అంది సుధీర. కళ్ళల్లో ఏదో తెలియని మెరుపు మెరుస్తోంది.

ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూసి తేరుకొన్నాడు రవి.

'లేచింది మహిళా లోకం' అంటూ వెంటనే పాట పారంభించాడు రవి.

ఈసారి గర్వంగా అతనివైపు చూసి, ఠీవిగా గదిలోకి వెళ్ళిపోయింది సుధీర. తల్లి అలాగే నోరు తెరచుకొని చూస్తోంది.

□

చురుక్కుమని వీపుమీద తగలడంతో ఉలిక్కిపడి లేచి కూర్చొంది మంచం మీద సుధీర. కళ్ళు నులుపుకొని చూసింది. ఎదురుగా తల్లి కోపంగా చెయ్యెత్తి నిలుచుంది మరో దెబ్బ వేయడానికి.

అయితే .... అయితే .... యింత సేపూ తను కలగన్నదన్నమాట. హుఁ.... లేకపోతే తనకింత ధైర్యమే!

"గంటనుంచీ లేపుతున్నాను. ఏమిటా మొద్దు నిద్ర? లే....లే....యిప్పటికే ఆలస్యమైంది. వాళ్ళొచ్చే వేళైయింది. త్వరగా తెములు" హడావుడిగా వెళ్ళిపోయింది తల్లి.

'ఎవరూ వచ్చేదీ?' ఒక్కక్షణం ఆశ్చర్యపోయింది. వెంటనే స్ఫురించింది. మద్రాస్‌నుంచి తనను చూసుకోడానికి ఎవరో వస్తున్నారని చెప్పింది అమ్మ ప్రొద్దున్న.

ఖర్మ! ఎంత మొత్తుకున్నా తన మాట వినరు కదా! ఇప్పటికి యిది నాలుగోసారి. తనకిష్టం లేదంటే వినకుండా తమ బాధ్యత తీర్చుకోవాలంటూ 'లెక్చర్' దంచుతారు నాన్నగారు. హుఁ.....ఆడపిల్లగా ఈ దేశంలో పుట్టినంత మహా పాపం, నేరం యింకోటి వుండదు. ఇంకా నయం – చదువు విషయంలో తననెవ్వరూ అడ్డు పెట్టలేదు. రిసర్చ్ చేయనిస్తున్నారు కూడా. అంత వరకూ అదృష్టవంతురాలే తను.

ఈ తతంగమంతా తనకిష్టం లేదని చెప్ప గలిగితే? అమ్మో! అంత ధైర్య మెక్కడిది తనకి?

'పేరుమాత్రం సుధీర వట్టి పిరికిదాన్న'ని ఫ్రెండ్సు వెక్కిరిస్తుంటారు అందుకే. వాళ్ళ నెదిరించే తెగువ, చొరవ తనకు లేవు. మనసులో మాత్రం ఏవేవో ధైర్యంగా అనుకుంటుంది. కాని తీరా నాన్నగారి గంభీర విగ్రహం, అమ్మ కఠంలోని అధికారం చూడగానే ఎక్కడి వక్కడే ఉష్ కాకి అవుతాయి.

లేచింది తయారవడానికి అయిష్టంగానే.

'ఎన్ని చట్టాలు రూపొందిస్తేనేం, ఎంత చైతన్యం వెల్లి విరిస్తే మాత్రమేం? నాలాంటి అమ్మాయిలు ఏ శతాబ్దంలోనూ మారరు. నిస్సహాయంగా జాలిగా అద్దంలో తన ప్రతిబింబం చూసి అనుకుంది సుధీర. ఆఖరికి తండ్రి కట్నం యివ్వడానికి సిద్ధంగా వుంటే దాన్నికూడా ధిక్కరించ లేకపోతోంది తను.

పెదవులు అప్రయత్నంగా పాడాయి.

'మగువ గతి యింతే

తెగువ చెయ్యేదం....తే'

❋